క్లుప్తంగా

చిలుకూరు ఎంపీడీఓగా హరిసింగ్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ హరిసింగ్

చిలుకూరు : చిలుకూరు మండల నూతన ఎంపీడీఓగా హరిసింగ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నేరేడుచర్ల మండలంలో ఎంపీఓగా పని చేసిన ఆయన ఎంపీడీఓగా పదోన్నతి పొంది చిలుకూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారం గ్రామానికి చెందిన ఉల్లేందుల రాజేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో బుధవారం బాధితుడి కుటుంబానికి హుజూర్‌నగర్ ముత్తూట్ ఫైనాన్స్ వారి ఎం జార్జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేనేజర్ నరేష్ బుధవారం రూ. 30 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కందుకూరి శ్రీనివాస్‌రెడ్డి, మౌలాలి, శంకర్, సత్యనారాయణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన మామిడి విక్రమ్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి ఐదు వేల రూపాయలు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్ ఐదు వేల రూపాయల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలుగూరి నాగరాజు, బాలెబోయిన కరుణాకర్, మామిడి రామకృష్ణ, ఎలుగూరి గోపి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ అనిల్‌రెడ్డి

కోదాడ : మండలంలోని నల్లబండగూడెంలో లింగమంతుల జాతరను పురస్కరించుకొని నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను గురువారం కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతను ఐక్యంగా ఉంచడానికి దోహద పడతాయన్నారు. జాతరను ప్రశాంతంగా ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బెంజిమెన్, మేకల కోటేశ్వరరావు, రవికుమార్, రామారావు, ఈశ్వర్, నారాయణ, భిక్షుయాదవ్, పెద్దబ్బాయి, సైదులు, శ్రీను, గోపి తదితరులు పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలు చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

గరిడేపల్లి : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు అన్నారు. హామీలు అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ పోస్టర్‌ను గురువారం మండలంలోని వెలిదండ గ్రామంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాశెట్టి అంజయ్య, చనగాని పెద్ద సాంబయ్య, లక్ష్మయ్య, శ్రీను, వెంకటయ్య, దాసు వెంకటయ్య, నరేష్, ముత్తయ్య, రేణుక, సంతోష, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల్లో జనసేన పోటీ ఖాయం'

నేరేడుచర్ల : త్వరలో రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీలో ఉంటుందని ఆ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేశ్వర్‌రావు అన్నారు. గురువారం నేరేడుచర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు శివసాయి, గోవర్ధన్, శ్రీను, కీసన నరేష్, రమేష్, సాయిచరణ్, చందు, మల్లయ్య ఉన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

మునగాల : సూర్యాపేట జిల్లాలో హత్యకు గురైన మాల బంటి కేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన బహుజన నాయకుడు రాయిరాల సుమన్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక బ్రాహ్మణుడిపై దాడి చేస్తే స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ దళితుడిని హత్యచేస్తే స్పందించకపోవడం విచారించదగ్గ విషయమన్నారు. ఒక ఆధిపత్య కులానికి చెందిన యువతి చనిపోయిందని నలుగురు అమాయకులను ఎన్‌కౌంటర్ చేసిన పాలకులు, ఒక దళితుడిని హతమారిస్తే మౌనంగా ఉండడం అంటే ఈ సమాజంలో ఉన్న కులపైత్యానికి అద్దం పడుతుందని ఎద్దేవా చేశారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ సూర్యాపేటకు వచ్చినప్పుడు కూడా జిల్లా కలెక్టర్, ఎస్పీలాంటి ఉన్నతాధికారులు బంటి ఇంటిని, కుటుంబాన్ని సందర్శించకపోవడాన్ని చూస్తే ఈ కేసును ఎంతలా నీరుగారుస్తున్నారో అర్థమవుతుందని అన్నారు.

లింగమంతుల జాతరకు ఏర్పాట్లు

- బోడిగుట్టపై 16వ తేదీ నుంచి లింగమంతులస్వామి జాతర
- సౌకర్యాల కల్పనకు నిధుల కొరత
- అధికారులు సహకరించాలని కోరుతున్న ఆలయ కమిటీ


ముస్తాబైన లింగమంతులస్వామి ఆలయం

కోదాడ : పట్టణ పరిధిలోని అనంతగిరి రోడ్డులో ఉన్న బోడిగుట్టపై గల లింగమంతులస్వామి దేవాలయం వద్ద ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి ప్రత్యేక నిధులు, మాన్యాలు లేకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులే చందాలు వేసుకొని జాతర జరిపేందుకు సిద్ధమవుతున్నారు. జాతరకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆలయ కమిటీ అనేకసార్లు విజ్ఞప్తి చేసినా అది కార్యరూపం దాల్చలేదని వారు చెబుతున్నారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో ఆలయం వద్ద ప్రభలు కూడా ఏర్పాటు చేయడం లేదని సమాచారం. కాగా, పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి వేలమంది భక్తులు ఈ జాతరకు తరలిరానున్నారు.

జాతర వివరాలు ఇవీ..

బోడిగుట్టపై ఈ నెల 16వ తేదీన ఉదయం ఆరు గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ప్రారంభించనున్నారు. అదే రోజు 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఇంటి వద్ద నుంచి దేవర పెట్టెను ఊరేగింపుగా గుట్టమీదకు తీసుకువస్తారు. అదే సమయంలో పెద్ద గొల్ల ఇంటి నుంచి ఆడపడుచులు మంద గంపలను ఊరేగింపుగా గుట్టమీదకు తీసుకు వెళ్తారు. 17న స్వామివారికి మొక్కుబడుల చెల్లింపు, సాయంత్రం పుష్పాలంకరణ, తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తారు. 18న స్వామివారి దేవరపెట్టెవద్ద చంద్రపట్నం పూజలు నిర్వహించి దేవరపెట్టెను తిరిగి పూర్వస్థానానికి చేర్చడంతో జాతర ముగుస్తుంది.

కనీస సౌకర్యాలు కరువు..

జాతరకు మరో రెండు రోజుల సమయమే ఉన్నా అక్కడ కనీస సౌకర్యాలు కల్పించలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయం వద్ద మంచినీటి సౌకర్యం లేదు. భక్తులు నిలబడడానికి నీడ కూడా లేదు. ఇక చలువ పందిళ్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా నిధులు లేక ఆలయ కమిటీ చేతులెత్తేసింది. మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. దీంతో జాతరకు వచ్చే మహిళలు ఇబ్బంది పడే అవకాశం ఉంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంచినీటి వసతితో పాటు తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

సహకారం అందించాలి



కోదాడలోని బోడిగుట్టపై ఈ నెల 16 నుంచి జరిగే లింగమంతులస్వామి జాతరను విజయవంతం చేయడానికి భక్తులు సహకరించాలి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. మున్సిపాలిటీ అధికారులు మంచినీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి. ఆలయ కమిటీకి అన్ని శాఖల అధికారులు సహకారం అందించాలి.

– ఈదుల కృష్ణయ్యయాద్, యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు

బీజేపీని మరింత బలోపేతం చేయాలి


బీజేపీ మండల అధ్యక్షులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : బీజేపీ నూతన మండల అధ్యక్షులు గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులను గురువారం హుజూర్‌నగర్‌లో ఆయన శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో అకుంఠిత శ్రమ చేసిన సామాన్య కార్యకర్తలు సైతం ఉన్నత స్థానానికి ఎదుగుతారని అన్నారు. రాబోయే ఎమ్మెల్సీ, పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ తమ వంతుగా కష్టపడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సరోజినినాయుడు జయంతి


సరోజినినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వాతంత్ర్య సమరయోధురాలు, భారతదేశ మొదటి మహిళా గవర్నర్ సరోజిని నాయుడు జయంతి, ఇంగ్ల భాష దినోత్సవం, జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజిని నాయుడు చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, వీరబాబు, సైదులు, జానకిరాములు, వెంకటేశ్వర్‌రావు, మాధవి, జానయ్య, భానుమతి, యాదగిరి, శ్రీనివాస్‌రావు, విజయలక్ష్మి, సరస్వతి, రషీద్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అవగాహన ఉండాలి


హుజూర్‌నగర్‌రూరల్ : అఖిల పక్ష నాయకులతో సమావేశమైన ఎంపీడీఓ లావణ్య

హుజూర్‌నగర్‌రూరల్ : పోలింగ్ కేంద్రాలపై రాజకీయ నాయకులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని ఏడు ఎంపీటీసీల స్థానాలకు 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఎవ్వరూ అభ్యంతరాలు తెలపకపోవడంతో వాటిని ఏకగ్రీవంగా అమోదించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ నబి, తదితరులు పాల్గొన్నారు.

42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

నేరేడుచర్ల : మండలంలో ఏడు ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలకు 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి తెలిపారు. గురువారం నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలపై నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 22 వేల 411 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. దాచారంలో 3014, కల్లూరులో 2082, మేడారంలో 3998, చిల్లేపల్లిలో 2940, పెంచికల్‌దిన్నలో 2531, సోమవరంలో 2768, దిర్శించర్లలో 5078 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏమైన అభ్యంతరాలు, సూచనలు ఉంటే ఈనెల 14వరకు తెలపాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీఓ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు, మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి చిత్తలూరి పెద్ద సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, నాయకులు పాండునాయక్, వెంకట సైదులు, నాగేశ్వర్‌రావు, వెంకట్, సత్యానంద్, వెంకట్, సిబ్బంది కోటి పాల్గొన్నారు.

తొమ్మిది ఇసుక ట్రాక్టర్లు సీజ్

మోతె : మండలంలోని నర్సింహాపురం, రంగాపురంతండా, ఉర్లుగొండ, తుమ్మగూడెం గ్రామాల శివారులో గల పాలేరు వాగు నుంచి గురువారం ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు మోతె ఎస్సై యాదవేందర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ల యజమానులు.. రాఘవాపురం గ్రామానికి చెందిన గంగరబోయిన లింగయ్య, రంగాపురం తండాకు చెందిన గుగులోతు సురేష్, వాంకుడోతు బుజ్జి, గుగులోతు పద్మ, పాచ్యనాయక్ తండాకు చెందిన ధరావత్ హేమకుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పాలేరు వాగుకు ట్రాక్టర్లు వెళ్లకుండా జేసీబీతో రహదారిలో గుంతలు తవ్వించినట్లు పేర్కొన్నారు.

రెండు ట్రాక్టర్లు పట్టివేత

నేరేడుచర్ల : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం నేరేడుచర్ల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం దాచారం సమీపంలో గల మూసీ నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి విరాళం అందజేత

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా చేపట్టిన కల్యాణమండపం నిర్మాణానికి గురువారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో హన్మకొండకు చెందిన గోవిందం వేణుమాధవ్, జ్యోతిర్మయి దంపతులు రూ.10,116 విరాళం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భవురిశెట్టి వెంకటరత్నం, కార్యదర్శి కొండా వెంకన్న, కోశాధికారి వందనపు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో ఎంపీడీఓ సరోజ, అధికారులు

గరిడేపల్లి : మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించబోయే టీబీ వ్యాధి నిర్ధారణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నరేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీవో సరోజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న గరిడేపల్లి, 19న మంగాపురం, 20న గారకుంటతండా, 21న కల్మల్పల్లి, 24న తాళ్లమల్కాపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం ఉండి బరువు తగ్గిన వారు, 60 సంవత్సరాల పైబడిన వృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగతాగే వారు, అధికంగా మద్యం సేవించేవారు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. తహసీల్దార్ బండ కవిత, సీనియర్ అసిస్టెంట్ మొయినుద్దీన్, అంజయ్య, వెంకటరమణ, కవిత పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి


వీరయ్య గౌడ్ (ఫైల్)

కోదాడ/అనంతగిరి : తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన గురువారం కోదాడ పట్టణ సమీపంలోని షణ్ముఖ ఐటీఐ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం ఖానాపురానికి చెందిన గీత కార్మికుడు పోలంపల్లి వీరయ్య(60) కోదాడ పట్టణ సమీపంలోని షణ్ముఖ ఐటీఐ వద్ద వ్యవసాయబావి వద్ద తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి నుంచి పడిపోయాడు. తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల వారు గమనించి వీరయ్యగౌడ్ బంధువులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పోలంపల్లి శివనితిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు కోదాడ ఏరియా ఆస్పత్రిలో వీరయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

'మిట్స్'లో వన మహోత్సవం


మొక్కలు నాటుతున్న హరితా ఫౌండేషన్ సభ్యులు, అధ్యాపకులు

చిలుకూరు : మండలంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం హరితా ఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా 250 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్ బ్యాగులు, టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హరితా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఫణి రాజ్‌కుమార్, జేఎన్‌టీయూ రిటైర్డు రిజిస్ట్రార్ డాక్టర్ మంజూర్ హుస్సేన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి, వైస్ చైర్మన్ మధిర గౌతమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కేశవరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బద్రంరాజు రాము, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీస్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామానికి చెందిన ఐక్యత యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. విజేతలకు నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లు అందజేశారు. అదేవిధంగా షాట్‌పుట్, రాష్ట్రస్థాయి కోలాటం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు నిర్వాహకుడు భరత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణం


హుజూర్‌నగర్ : ఫణిగిరి గట్టుపై నుంచి స్వామి అమ్మవార్లను కల్యాణ మండపానికి తీసుకొస్తున్న పూజారులు, ఈఓ


హుజూర్‌నగర్ : స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హుజూర్‌నగర్ : స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని ఫణిగిరి గట్టుపై వెలిసిన శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని గురువారం తెల్లవారుజామున అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని మంగళవాయిద్యాల నడుమ గట్టుపై నుంచి కల్యాణ వేదికకు తీసుకువచ్చి 108 దివిటీలతో ఎదుర్కోలు మహోత్సవం జరిపారు. స్వామివారి తరుపున అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, అమ్మవారి తరుపున యాజ్ఞికులు వేదాంతం మోహనకృష్ణమాచార్యులు ఎదుర్కోలు ఉత్సవాన్ని చెలోక్తులతో ఆద్యంతం రక్తికట్టించారు. స్వామి, అమ్మవారికి ఈఓ గుజ్జుల కొండారెడ్డి దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణంలో మొదట విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం చేసి కంకణధారణను అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. యజ్ఞోపవేతం తదుపరి పాదప్రక్షాళన చేసి అమ్మవారి మెడలో మంగళసూత్రాన్ని స్వామివారిచే అలంకరింపజేశారు. తదనంతరం తలంబ్రాలు, పూలబంతులాట తదితర కల్యాణ ఘట్టాలను అర్చకులు వేదమంత్రాల నడుమ కనుల పండువగా నిర్వహించారు. గుట్ట కింద కళావేదికపై రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం వారిచే డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించారు. శ్రీసీతారామచంద్ర స్వామి అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. గట్టుమీద స్టేజీపై అన్నమయ్య భజన మండలి, గీతా గోవిందం భజన మండలి వారు నిర్వహించిన భజన, కీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్థానాచార్యులు, అర్చకులు, ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి పవళింపుసేవ


మఠంపల్లి : శ్రీవేణుగోపాలస్వామి పవళింపు సేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాలకవర్గ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పవళింపు సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యార్చన, బలిహరణ, సాయంత్రం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి అమ్మవార్లను సుందరంగాపూలతో అలంకరించి పవళింపు సేవ చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సింగారపు సైదులు, ఈవో నాగెళ్ల శంభిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, ఆలయ కమిటీ సభ్యులు కంచాల వీరారెడ్డి, ఉబ్బెపల్లి సైదులు, పుట్టపాకుల మల్లేశ్వరి, ఐతగాని శివయ్య, అర్చకులు నరగిరినాధుని రామకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

నడిగూడెం : మండలంలోని సిరిపురం శ్రీ రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లూరి రమేష్, ప్రధాన అర్చకులు వల్లప్రోలు నర్సింహాచార్యులు, పూజారులు వేదాంతం చక్రధరాచార్యులు, రంగాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కమణీయం.. శ్రీవారి కల్యాణం


వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు, పాల్గొన్న భక్తులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీస్వయంభూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి స్వామివారి తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చొనగా, ఆలయ ప్రధాన అర్చకులు కందాళ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాల నడుమ కల్యాణాన్ని జరిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పాలిశెట్టి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు. స్థానిక పోలీస్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐక్యత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్, షాట్‌పుట్, కోలాటం పోటీల్లో గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

మట్టపల్లిలో విశేష పూజలు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేపట్టారు. శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్యధారణ తలంబ్రాలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాబాచార్యులు. బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

మట్టపల్లి ఆలయంలో కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. గురువారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. వేలంలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు. ఈ ఏడాది మార్చి నెల 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు వేలం గడువు వర్తిస్తుందన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


మునగాల : అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో గురువారం కోదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన నల్లూరి లక్ష్మయ్య మూడవ వర్ధంతిని పురస్కరించుకొని కుమారులు నల్లూరి రవి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నల్లూరి –సునీత దంపతులు, కుటుంబ సభ్యులు గణేష్, నిఖిత, రాధ, ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

సాయి మందిరంలో..

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో గల షిర్డీసాయి మందిరంలో గురువారం మునగాలకు చెందిన కుందూరు సీతారాములు –సునీత దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవినేని రవికుమార్, తడకమళ్ల శ్రీనివాసాచారి, బాలాజీ, పెనుగొండ వెంకటచలపతి, కుందూరు వీరభద్రం, వెంకటనారాయణ, కోదాటి శ్రీను, భక్తులు పాల్గొన్నారు.

చిన్నారులకు..

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన మల్లి కంటి పద్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగరాజు–మమత దంపతులు గురువారం స్థానిక జీప్సీ అనాథ పిల్లల వసతి గృహంలోని పిల్లలకు అన్నదానం చేశారు. సామాజిక కార్యక ర్త రా ము, రజని, లక్ష్మీ నారాయణ, కోటయ్య, సా యి,ధన్‌పాల్, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నేడు జెర్రిపోతులగూడెంలో కనకదుర్గమ్మ జాతర


ముస్తాబైన కనకదుర్గమ్మ ఆలయం

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామంలో శుక్రవారం కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేశారు. ప్రతి శివ రాత్రికి ముందు నెలలో రెండో శుక్రవారం ఈ జాతర జరుపుకోవడం ఇక్కడ ఆనవాయితీ. జాతరలో భాగంగా రైతులు ప్రభబండ్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయ వద్దకు తీసుకొని వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకొని అనంతరం వనభోజనాలకు వెళ్తారు. వివిధ పార్టీల ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఉదయం కోలాటాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. ఎన్నికల కోడ్ ఉండడంతో నిబంధనల మేరకు జాతరను జరుపుకునేందుకు అన్ని పార్టీల నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ సురభి రాంబాబుగౌడ్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : నడిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కరివిరాల ఫీడర్ ఛానల్‌కు శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కె.సైదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కరివిరాల ఫీడర్ ఛానల్ వెంట ఉన్న చెట్ల కొమ్మలను సిబ్బంది తొలగించనున్నందున ఈ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.